సాక్షి సంగారెడ్డి

శనివారం । 29 । మార్చి । 2025

ఉగాది కవితలకు ఆహ్వానం




సంగారెడ్డి జోన్: ఉగాది పర్వ దినాన్ని పురస్కరించుకుని 'సాక్షి'దినపత్రిక కవితల్ని ఆహ్వానిస్తోంది. ఎనిమిది లైన్లకు మించకుండా తమ కవితల్ని పంపించాలి. కవితల్ని ఫొటో, చిరునామాతో ఈనెల 29 సాయంత్రంలోగా 95058 72923 నంబర్‌కు వాట్సప్ చేయాలి. ఇందులోని ఉత్తమ కవితలను గుర్తించి 'సాక్షి'లో ప్రచురిస్తాం.



మెట్ల బావి... చారిత్రక దారి

శతాబ్దాల చరిత్ర కలిగిన మెట్లబావులు నిరాదరణకు గురై రూపు రేఖలు కోల్పోతున్నాయి. వివరాలు 10లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శనివారం	ఆదివారం
సా. 6.34 గం.	ఉ. 4.51 గం.

న్యూస్‌రీల్

శని అమావాస్య వేడుకలకు సర్వం సిద్ధం



బర్దీపూర్‌లోని శనీశ్వర విగ్రహం

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం శని అమావాస్య వేడుకలకు సర్వం సిద్ధమైంది. శని అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇందుకోసం ఆశ్రమంలోని శనేశ్వరస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, క్యూ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి తైలాభిషేకం, శని మహాయజ్ఞం, జ్యేష్ఠాదేవి సమేత శనేశ్వర స్వామి కల్యాణోత్సవం, మహామంగళ హారతి, భక్తులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామ శివారులోని సప్తపురి శనిఘాట్ వద్ద ఏర్పాట్లు చేశారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల నియామకం

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్లలోని తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో గణితం, బోటనీ సబ్జెక్టులకు సంబంధించి అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, నెట్, సెట్ అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా ఏప్రిల్ 3న విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6281279006, 9642286686 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి ప్రయాణికుల సలహాలు, సూచనల మేరకు శనివారం డయల్ యువర్... డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11.30 నుంచి 12.30 వరకు కొనసాగే ఈ కార్యక్రమంకోసం ప్రయాణికులు 99592 26267 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఓడీఎఫ్‌కు భారీ ఆర్డర్



యుద్ధ ట్యాంకుల తయారీ ఒప్పందంపై సంతకాలు చేస్తున్న అధికారులు

కంది (సంగారెడ్డి): కందిమండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్)కు యుద్ధ ట్యాంకుల తయారీ కోసం భారీ ఆర్డర్ లభించింది. ఈ మేరకు శుక్రవారం (ఏవీఎన్ఎల్) ఓడీఎఫ్ సంస్థ కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. వీటిలో 293 యుద్ధ ట్యాంకులతో పాటు అత్యంత అధునాతనమైన 13 నామీస్ ట్యాంకులు ఉన్నాయి. రక్షణ శాఖకు ఉపయోగపడే విధంగా తయారు చేసి అందజేయనున్నారు. కార్యక్రమంలో కేంద్ర రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్, ఓడీఎఫ్ చీఫ్ జనరల్ మేనేజర్ శివ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నాటక ప్రదర్శన జయప్రదం చేయండి



నాటక ప్రదర్శన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): వచ్చేనెల 2న సదాశివపేట పట్టణంలోని ఎన్ గార్డెన్‌లో ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి (అంబేడ్కర్ జీవితం) నాటకాన్ని ప్రజలంతా హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. నాటక ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ప్రభు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సీనియర్‌న్యాయవాది దర్శన్,దళిత నాయకులు లక్ష్మయ్య, బాల్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంచనాలు అధికమే

- ఈసారి కొనుగోళ్లకు రబీ ధాన్యం 1.52 లక్షల మెట్రిక్ టన్నులు
- అంచనాలు రూపొందించిన వ్యవసాయశాఖ
- 38 వేల ఎకరాల్లో వరి సాగైనట్లు గుర్తింపు
- గతేడాది కంటే కాస్త ఎక్కువే అంటున్న అధికారులు
- ఇందుకు భిన్నంగా వాస్తవ పరిస్థితులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఈ రబీ ధాన్యం కొనుగోలు సీజనులో జిల్లాలో సుమారు 1.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో రెండు వేల మెట్రిక్ టన్నులు సన్న ధాన్యం కాగా, మిగిలిన 1.50 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ఉంటుందని భావిస్తున్నారు. రబీ ధాన్యం సేకరణ కోసం ముందస్తు ప్రణాళికను రూపొందించారు. ఈ సీజనులో జిల్లాలో రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 27,646 ఎకరాలు కాగా, ఈసారి 38,740 ఎకరాల్లో ఈ పంట వేసినట్లు గుర్తించారు. ఇందులో 35,641 ఎకరాల్లో దొడ్డు రకం కాగా, 3,099 ఎకరాల్లో సన్నరకాలు సాగైనట్లు లెక్కతేల్చారు. రెండు కలిపి 2.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇందులో స్థానిక అవసరాలకు 55,456 మెట్రిక్ టన్నులు పోగా, మిగిలిన 1.52 లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రణాళికను రూపొందించారు.

గత రబీలో 1.38 లక్షల మెట్రిక్ టన్నులు..

గతేడాది 2023–24 రబీ కొనుగోలు సీజనులో 1.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అయితే ఈసారి అంతకంటే 14 వేల మెట్రిక్ టన్నులు ఎక్కువే కొనుగోలు చేయాల్సి ఉంటుందని భావిస్తున్నారు. కాగా, వ్యవసాయశాఖ అంచనాలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈసారి సింగూరు ప్రాజెక్టు ఆయకట్టుకు క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో వరి సాగు విస్తీర్ణం తగ్గి..అనుకున్న మేరకు ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే అవకాశాలు లేవని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు ఈసారి ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు వట్టిపోయాయి. చాలాచోట్ల బోర్లు ఎండిపోయి వరి పంటకు సాగునీరు అందడం లేదు. దీని ప్రభావం కూడా పంట దిగుబడిపై పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇలా వివిధ కారణాలతో గతేడాది వచ్చినంత కూడా ఈసారి ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశాలు లేవని అంటున్నారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా ఎక్కువ అంచనాలు రూపొందించారని అధికారులు అంటున్నారు.

216 కొనుగోలు కేంద్రాలు..

ఈసారి ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా 216 కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందులో 195 కేంద్రాలు దొడ్డురకం ధాన్యం సేకరణ కోసం నెలకొల్పాలని, మిగిలిన 21 కేంద్రాల్లో కేవలం సన్న రకం ధాన్యం మాత్రమే సేకరించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో 93 కేంద్రాల నిర్వహణ బాధ్యతలను సహకార సంఘాలకు అప్పగించాలని అనుకుంటున్నారు. 89 కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతాయి. డీసీఎంఎస్‌కు 33 కొనుగోలు కేంద్రాలు, ఎఫ్ఎస్‌సీకి మరో కేంద్రం బాధ్యతలను అప్పగించాలని అనుకుంటున్నారు.

ఇఫ్తార్‌లో మంత్రి దామోదర

పండ్లు తినిపించి ఉపవాసాన్ని విరమింపజేసిన మంత్రి



జోగిపేట ఇఫ్తార్‌లో మత పెద్దలకు ఖర్జూరం తినిపిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

జోగిపేట(అందోల్): రంజాన్ మాసం సందర్భంగా జోగిపేటలోని శ్రీరామ గార్డెన్‌లో శుక్రవారం ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ముస్లిం సోదరులకు మంత్రి ఖర్జూర పండ్లను తినిపించారు. మత పెద్దలు, ముస్లింలు మంత్రికి పండ్లు తినిపించారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దారు విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, మునిపల్ కమిషనర్ తిరుపతి, జోగిపేట ఏఎంసీ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ పద్మనాభరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థినులకు మంత్రి అభినందన



వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి దామోదర

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ చాటిన అందోల్ మండలం సంగుపేట ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులను మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. జోగిపేటలో ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి దామోదర్‌ను విద్యార్థినులు జ్ఞాపికలతో కలిశారు. సిద్దిపేట జిల్లా తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో టెన్నికాయిట్ విభాగంలో అను, రజిత, నవ్యత తొలిస్థానం, క్యారమ్స్‌లో స్పందన, షణ్ముఖ ప్రియ, తొలిస్థానం, షాట్‌పుట్‌లో తొలిస్థానంలో గంగోత్రి, డిస్క్ త్రోలో మొదటి స్థానం అంజలి, లాంగ్‌జంప్, షటిల్ బ్యాడ్మింటన్‌లో అను, నవ్యత, సృజనలు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మంత్రికి వివరించారు. భవిష్యత్తులో మరిన్ని విజ యాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే సునీతారెడ్డి



హత్నూర మండలం దౌల్తాబాద్ ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): మైనార్టీ ముస్లింల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి స్పష్టం చేశారు. హత్నూర మండలం దౌల్తాబాద్ కాసాల గ్రామ శివారులోని బి.ఎన్.రెడ్డి గార్డెన్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో సునీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...దౌల్తాబాద్ కాసాల గ్రామ శివారులోని షాదీఖానా నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశామని ప్రస్తుత ప్రభుత్వం కూడా మైనార్టీ ముస్లింలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, తహసీల్దార్ పర్వీన్ షేక్, అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు రాష్ట్ర మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీమ్, మండలంలోని వివిధ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15% నిధులివ్వాలి

టీఎస్ యూటీఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15% నిధులు కేటాయించడంతోపాటు తక్షణమే ఉద్యోగులకు పీఆర్‌సీని ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 7.1%మాత్రమే కేటాయించిందని దాన్ని 15%కు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సామాజిక స్థితిగతులు దృష్టిలో ఉంచుకుని 30% ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డైన నెలలోనే పెన్షన్ పత్రాలు

ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్



పీపీఓ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలను మంజూరు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ స్పష్టం చేశారు. మార్చి నెలలో పదవీ విరమణ పొందిన 47 ఉద్యోగులకు పీపీఓలను జారీ చేసి అందులో 20మందికి వాటిని శుక్రవారం అందజేశారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ దీపక్ మీనా,సెక్షన్ సూపర్‌వైజర్ జానకిరామారావు తదితరులున్నారు.

ఉపాధికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నర్సింలు

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండల పరిధిలోని మారేపల్లి, గంగారం గ్రామాలలో శుక్రవారం పర్యటించి ఉపాధి హామీ కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ఉపాధి హామీ నుంచి కూలీలను,పేదలను దూరం చేస్తుందన్నారు. 15 రోజుల్లో ఉపాధి హామీ డబ్బులు ఇవ్వాలని చట్టం చెబుతుంటే రెండు నెలలైనా డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు? పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ 600 కు పెంచాలని డిమాండ్ చేశారు.

మైనార్టీ సవరణ బిల్లును విరమించుకోవాలి



హత్నూర జమా మసీదులో నిరసన తెలుపుతున్న ముస్లింలు

హత్నూర(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం వెంటనే మైనార్టీ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును విరమించుకోవాలని మజీద్ కమిటీ డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు కేంద్రం బిల్లు సవరణ నిర్ణయాన్ని నిరసిస్తూ మండల కేంద్రమైన హత్నూర జమ్మా మసీదులో శుక్రవారం ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆ సవరణ బిల్లును విరమించుకోవాలని వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలని నిరసన వ్యక్తం చేశారు.

వారాంతపు సంత.. వసతుల చింత

- సంతలలో కనిపించని కనీస సౌకర్యాలు
- ప్రధాన రహదారులపై పార్కింగ్ కష్టాలు
- మార్కెట్ యార్డులలో పారిశుద్ధ్య లోపం
- సమస్యలు పట్టించుకోని అధికారులు



పట్టణంలో అసౌకర్యాల మధ్య వారాంతపు సంత

సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలోని మార్కెట్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయ్యింది. కూరగాయలు కొనుగోలు చేసే ప్రాంతాలు, మార్కెట్ యార్డులలో కనీస వసతులు లేకపోవటంతో అటు కొనుగోలుదారులు ఇటు అమ్మేవారు నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి ఉన్న యార్డులలో రోజులు గడుస్తున్నా పనులు మాత్రం చేపట్టడం లేదు. దీంతో మార్కెట్ యార్డులలో కుళ్లిపోయిన కూరగాయలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టణంలో నాలుగు వారాంతపు సంతలు

పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా, బైపాస్‌రోడ్డు, ఓల్డ్ బస్టాండ్(భవానీ మందిరం), సినిమా థియేటర్ (గంజి మైదానం) నాలుగు ప్రదేశాలలో వారాంతపు సంతలు జరుగుతుంటాయి. పట్టణంలోని ప్రజలతోపాటు పరిసర ప్రాంత గ్రామ ప్రజలు వారాంతపు సంతలో కూరగాయలు, నాన్ వెజ్‌తోపాటు వివిధ రకాల సామగ్రిని కొనుగోలు చేస్తుంటారు.

రహదారులపైనే వాహనాలు పార్కింగ్

ప్రధాన రహదారితోపాటు గల్లీలలో వారాంతపు సంతలు జరుగుతుంటాయి. సంతలు జరిగే సమయంలో కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు తమ వాహనాలను ప్రధాన రహదారులపైనే పార్కింగ్ చేస్తున్నారు. వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో రహదారులపై రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

నిర్మాణదశలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు



సంగారెడ్డిలో ఆగిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణపు పనులు

పట్టణంలోని బైపాస్ రోడ్డు ఆవరణలో సుమారు 2 ఎకరాల విస్తీర్ణంలో రూ.6.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ సముదాయ మార్కెట్ యార్డు నిర్మాణ దశలోనే ఉంది. 2021 డిసెంబర్ 18న పనులకు శంకుస్థాపన చేశారు. సంవత్సరాలు పూర్తి కావస్తున్నా పనులు మాత్రం పూర్తి కాలేదు. మార్కెట్ సముదాయం నిర్మాణం పూర్తి అయితే వ్యాపారస్తులతోపాటు ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపంతో పట్టణంలోని ప్రజామరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గత కొన్ని నెలలుగా వినియోగం లేకపోవటంతో వృథాగా పడి ఉన్నాయి. నిత్యం పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్లు లేకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు.

వసతుల కల్పనలో విఫలం

పట్టణంలో నిర్వహించే వారాంతపు సంతలో అధికారులు వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారు. తాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, నీడ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే సంతలోని కూరగాయలు పూర్తిగా తడిచిపోతుండటం, వేసవిలో ఎండ దెబ్బకు కూరగాయలు పాడవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు.

సంతలలో తైబజార్ వసూళ్లు

పట్టణంలో వారాంతపు సంతలు జరుగుతాయి. రహదారులపై తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తుంటారు. అందుకు సంబంధిత అధికారులు తైబజార్ పేరిట రుసుం వసూలు చేస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ వ్యాపారస్తులకు కనీస సౌకర్యాలు కల్పించటం లేదని వాపోతున్నారు.



సంగారెడ్డి మార్కెట్ యార్డులో కూరగాయల వ్యర్థాలు, చెత్తాచెదారం

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



పట్టణంలో పర్యటిస్తున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జోన్: విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జగ్నికే రాత్ సందర్భంగా గురువారం అర్ధరాత్రి పట్టణంలోని పలు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన బీట్ పికెట్స్‌ను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి వారి సాంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదని, అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

అన్ని ఉద్యమాలకు మూలం కవితలు

- ప్రముఖ కవి నందిని సిధారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిధారెడ్డి

మెదక్‌జోన్: అన్ని ఉద్యమాల్లో కవితోద్యమం ముందు వరుసలో ఉందని, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కవి పాత్ర ఎనలేనిదని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఉగాది కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. తెరసం మెదక్ జిల్లా అధ్యక్షురాలు ముత్తంగారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యతిథిగా సిధారెడ్డి హాజరై మాట్లాడారు. కవిత్వం అన్ని రంగాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. చరిత్ర కు వారధులు కవులని, చరిత్ర భావితరాలకు తెలియాలంటే కవులు కళాలను కదిలించాలన్నారు. తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాశేశ్వరం శంకర్ మాట్లాడుతూ.. గతేడాది సంతోషాలతోపాటు బాధలు మిగిల్చిందని సునీత విలియమ్స్ భూమి పైన సజీవంగా అడుగు పెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యువ కవి ఎక్బాల్, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై విచారణ



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం పాక్షిక ధ్వంసం చేసిన ఘటనపై శుక్రవారం గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన జింక తిరుపతి విగ్రహం గద్దెపై కూర్చొని కట్టెతో చేయిపై కొట్టడంతో చేయి పాక్షికంగా దెబ్బతిన్న విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై ఏసీపీ గ్రామానికి చేరుకొని ఘటనకు సంబంధించి స్థానికుల నుంచి వివరాలు సేకరించి రికార్డు చేశారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు విషయమై ఎంక్వైరీ చేశారు. సేకరించిన వివరాలను పై అధికారులకు నివేదిస్తామని ఏసీపీ తెలిపారు. ఆయన వెంట తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు ఉన్నారు.

మృతదేహం లభ్యం



వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ రవీందర్ కథనం మేరకు.. శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం ఉందని చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే రూరల్ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మునిపల్లి(అందోల్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బొడ్పట్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. మండలంలోని బొడ్పట్‌పల్లి గ్రామానికి చెందిన రాజు (36) అప్పుల బాధతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో బుదేరా పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోనేరు.. ఎవరూ పట్టించుకోరు

నర్సాపూర్ రూరల్: కాకతీయుల కాలంలో నర్సాపూర్ మండలంలోని సీతారాంపూర్‌లో నిర్మించిన మెట్ల బావి (కోనేరు) కొన్ని వందల ఏళ్లపాటు సీతారాముల పూజతో పాటు గ్రామస్తులకు తాగునీరు పుష్కలంగా అందించింది. సీతారాంపూర్ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన రామాలయంకు వాయువ్యం దిక్కు ఈ కోనేరు ఉంది. సుమారు 400 ఏళ్లపాటు సీతారాముల పూజకు కావాల్సిన నీరు, గ్రామస్తుల తాగునీటితోపాటు ఇతర అవసరాలకు మండుటెండల్లో సైతం నిరంతరం నీరు పుష్కలంగా అందించేదని తెలిపారు. బోరు బావులు, నల్లాలు వచ్చిన తర్వాత మెట్ల కోనేరులో నీరు అడగండిపోవడంతో నిరుపయోగంగా మారింది.

సీతారాంపూర్‌లోని మెట్ల బావి (కోనేరు)



మెట్ల బావి.. చారిత్రక దారి

శతాబ్దాల చరిత్ర ఉన్న మెట్ల బావులు మన సంస్కృతిలో భాగం. అయితే దశాబ్దాలుగా నిరాదరణకు గురై రూపురేఖలు కోల్పోతున్నాయి. నేటికీ పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో గతంలో సాగు, తాగు నీటికి ఉపయోగపడిన మెట్ల బావులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల వాడుకలో ఉండగా మరికొన్ని చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయి ఎవరూ పట్టించుకోకపోవడంతో చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలిపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో శతాబ్దాల చరిత్ర కలిగిన మెట్ల బావులు

- గతంలో సాగు, తాగు నీటికి ఉపయోగం
- నేడు మెట్లు కూలిపోయి చెత్తాచెదారంతో నిరుపయోగం
- చరిత్రకు సాక్ష్యాలుగా మిగులుతూ దర్శనం



వెల్దుర్తిలో వెంకటేశంగుప్త తవ్వించిన మెట్లబావి

కరువులో కూలీలకు ఉపాధి కోసం..

వెల్దుర్తి(తూప్రాన్) : వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో తీవ్ర కరువు ఏర్పడిన సమయంలో వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన కొమిరిశెట్టి వెంకటేశం గుప్త కూలీలకు పని కల్పించడం కోసం సుమారు 1972 సంవత్సరంలో పెద్ద మెట్లబావి తవ్వించారు. సుమారు 40 ఫీట్ల వెడల్పు, 120 ఫీట్ల లోతులో తవ్వించిన బావిలోని నీటిని మొదట్లో చుట్టుపక్కల నివాసితులు తాగునీటికి ఉపయోగించగా కాలక్రమేణ వెంకటేశం గుప్త బావి పక్కనే గల తన వ్యవసాయ పొలానికి సాగునీరుకు ఉపయోగించాడు. మొదట్లో బావిలోకి పెద్ద ఎత్తున ఊట నీరు చేరేదని, ప్రస్తుతం ఊటనీరు చాలా తగ్గడంతో వర్షాకాలంలోనే వర్షపు నీరు చేరుతుందన్నారు. సుమారు 200 రాతిమెట్లు గల భావిని తవ్వడానికి కూలీలకు ఒక్కరోజుకు అప్పట్లో ఒక్క రూపాయి చెల్లించడంతోపాటు వడ్లను ఇచ్చేవారని అప్పట్లో పనులకు వెళ్లిన వృద్ధులు తెలిపారు.

అద్భుత రాతి కట్టడంతో 600 ఏళ్ల నాటి మెట్లబావి

నేటికీ సాగు నీటికి వినియోగం

చిన్నశంకరంపేట(మెదక్): ఆరు వందల ఏళ్లనాటి అద్భుతమైన రాతి కట్టడంతో నిర్మించిన ఏడు చేదల మెట్లబావి చెక్కు చెదరకుండా తన దర్పం ఒలకబోస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో పాపన్నపేట సంస్థాన రాజ్యవంశంలో 1395 నుంచి 1422 మధ్య కాలంలో రాణి చందమ్మ ఏకఛత్రాధిపత్యంలో రాజ్యవిస్తరణకు నడుంబిగించిన కాలంలో నిర్మాణం జరుపుకున్న కట్టడమే చందంపేట కోటదుర్గం. ఈ కోట దుర్గం పక్కనే తవ్విన బావిని రాతి కట్టడంతో మెట్లు, సేద తీరేందుకు అవసరమైన చిన్న చిన్న గదులు ఈ బావి ప్రత్యేకత. ఆరు వందల ఏళ్ల కిందట నాలుగు వైపులా ఎత్తయిన బురుజులతో ఈ కోటను కట్టించారు. ఇదేస్థాయిలో బావి నిర్మాణం చేపట్టారు. అప్పట్లో రాణి చందమ్మ ఏడు చేదల బావి వద్ద సేద తీరేవారని, సైనికులకు, గుర్రాలకు అవసరమైన తాగునీరుకు వినియోగించేవారని ప్రతీతి. ప్రస్తుతం కూడా వ్యవసాయానికి సాగునీరుగా వినియోగిస్తున్నారు. రాతి కట్టడం ఎక్కడ చెక్కు చెదరకుండా, మెట్లు కూడా వినియోగంలో ఉన్నవి.



చందంపేటలోని మెట్లబావి

70 ఏళ్లు సాగునీరు అందించి..

ప్రస్తుతం చెట్ల పొదలతో కళ తప్పిన బావి



కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఈశ్వరాలయ మెట్లబావి

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఈశ్వరాలయాన్ని క్రీస్తు శకం 1,824 సంవత్సరంలో గ్రామానికి చెందిన కీ.శే నోమన్నగారి వెంకట్‌రెడ్డి తనకు ఉన్న సొంత పొలంలో కొంత భాగాన్ని ఆలయం కోసం కేటాయించి ఆలయాన్ని నిర్మింపజేశాడు. అప్పట్లో ఆలయం, సాగు నీటి అవసరాల కోసం ఆలయం ఎదుట 40 ఫీట్ల లోతులో మెట్ల బావిని తవ్వించి డంగు సున్నం తయారు చేయించి బావి చుట్టూ మెట్లు ఏర్పాటు చేసి రాతితో కట్టించాడు. ఒక్కో లేవల్ 20 అడుగుల ఎత్తు ఉండగా బావి చుట్టూ మెట్లు నిర్మాణం చేపట్టారు. బావిలోకి దిగేందుకు పడమర, వాయువ్యం వైపు మెట్లు నిర్మించారు. ఎండాకాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా బావి ఎప్పుడూ నీటిని కలిగి ఉండటంతో సంవత్సర కాలంపాటు ఎద్దులతో మోట కొడుతూ పంటకు నీరందిన చరిత్ర. ఇలా సుమారుగా 70 ఏళ్ల పాటు మెట్లబావి ద్వారా వ్యవసాయానికి నీరు అందించింది. నేడు ఆదరణ లేక చెట్ల పొదలతో నిండి శిథిలావస్థకు చేరుకుంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన మెట్ల బావిని ప్రభుత్వం పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణాలోనే అతి పెద్ద కోనేరు..

800 ఏళ్ల చరిత్ర కలిగిన కిచ్చన్నపల్లి వేంకటేశ్వర ఆలయ మెట్లబావి

వట్‌పల్లి(అందోల్): ఉత్తర తిరుమలగా పేరున్న కిచ్చన్నపల్లిలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయం కోనేరుకు 800 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ కోనేరు సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కిచ్చన్నపల్లి గ్రామంలో ఉంది. ఆలయాన్ని 900 ఏళ్ల కిందట కిచ్చన్న అనే భక్తుడు నిర్మించాడు. సుమారు ఎకరా స్థలంలో 60 ఫీట్ల లోతులో నలువైపులా 30 మెట్లు చొప్పున నిర్మిచారు. ఊట ద్వారా కోనేరులోకి వచ్చే నీటిని భక్తులు స్నానాలు చేయడంతోపాటు ఆ నీటిని ఆలయానికి అవసరమైన పూల తోటలకు కూడా నిత్యం వాడేవారు. భక్తులు కోనేరులోనే స్నానం చేసి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే వారు. గ్రామాల్లో నలువైపులా బోరు బావులు తవ్వడంతో కోనేరులో ఊటలు నిలిచిపోయి ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. దీంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా బోరును వేయించి ఆ నీటితో కోనేరును నింపేవారు క్రమేపి కోనేరును పట్టించుకునే వారు కరువయ్యారు.



కిచ్చన్నపల్లిలో వెంకటేశ్వరాలయం వద్ద కోనేరు

‘బావి’తరాలకు చెప్పడానికి లేకుండా..

సంగారెడ్డి జోన్: చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న మెట్ల బావులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కప్పుడు సాగుకు, తాగుకు నీరందించి చరిత్ర కలిగిన బావులు నేడు నీరు లేక వెలవెలబోతున్నాయి. 1960–65 సంవత్సరాల మధ్యకాలంలో బావులు నిర్మించినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. సుమారు 50 నుంచి 60 లోతుల అడుగులో బావుల నిర్మాణాలు చేపట్టారు. వీటిని నిర్మించేందుకు సుమారు మూడేళ్లు పట్టేదని చెబుతున్నారు. మండలంలో కుప్పానగర్, బర్దీపూర్, మాచ్నూర్ గ్రామ శివారుల్లో పురాతన మెట్ల బావులు ఉన్నాయి. పంటల సాగులో వచ్చిన లాభంతో బావిలోని జలధారలు పైన ఉన్న మట్టితో పూడ్చిపోకుండా ఉండేందుకు మెట్ల బావులను నిర్మించారు.

బోరు ఎక్కువై నీరు అడుగంటి..

మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో బస్వంత్‌రావు పాటిల్ అడివప్ప షెట్కార్, కేశప్ప రైతు పొలాల ఆవరణలో మెట్ల బావిని నిర్మించారు. పూర్వం బోరు మోటార్లు లేకపోవడంతో ఈ బావుల సహాయంతో పంటలు సాగు చేసేవారు. బావిలో నుండి బొక్కెన, ఎడ్ల సహాయంతో నీరు పైకి లాగి పంట పొలాలకు నీరందించేవారు. అదే విధంగా పంట పొలాలకు వివిధ పనులపై వెళ్లిన వారికి దాహార్తిని తీర్చుకునేందుకు ఉపయోగపడేవి. నేడు విచ్చలవిడిగా బోర్లు వేయడంతో భూగర్భజలాలు పడిపోయి మెట్ల బావులు నిరాదరణకు గురి అయ్యాయి. వీటిని పునరుద్ధరిస్తే చరిత్రకు జీవం పోసినట్లు ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం పరుస్తున్నారు.



బస్వంత్‌రావు పాటిల్ పొలం వద్ద బావి



కుప్పానగర్ గ్రామ శివారులోని మెట్ల బావి

ఇద్దరిని బలిగొన్న రాంగ్‌రూట్

ఎక్సెల్ వాహనం, బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం

- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- తల్లీ, కుమారుడికి తీవ్రగాయాలు
- కోహీర్ మండలంలోని కొత్తూర్(డి) గ్రామం వద్ద ఘటన



ఉమేశ్, శ్రీశైలం మృతదేహాలు క్షతగాత్రులు

జహీరాబాద్: రాంగ్‌రూట్‌లో వచ్చిన డీసీఎం వాహనం ఇద్దరిని బలిగొంది. ఎక్సెల్ వాహనం, బైక్‌ను ఒకదాని వెంట ఒకదాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లి, కుమారుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం కోహీర్ మండలంలోని కొత్తూర్(డి) గ్రామం వద్ద 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన వాడిగా భావిస్తున్న ఉమేశ్(45) భార్య శరణమ్మ, కుమారుడు సిద్ధుతో కలిసి ఎక్సెల్ వాహనంపై జహీరాబాద్ వైపు వస్తున్నారు. వీరి వెనుకాలే కంది మండలం మక్త అల్లూరు గ్రామానికి చెందిన శ్రీశైలం(30) బైక్‌పై వస్తున్నాడు. 65వ జాతీయ రహదారిపై కోహీర్ మండలంలోని కొత్తూర్(డి) గ్రామం వద్దకు రాగానే కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల వీఎస్‌టీ కర్మాగారం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం రాంగ్‌రూట్‌లో వచ్చి ఎక్సెల్‌ను, మోటార్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం, ఉమేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఉమేశ్ భార్య శరణమ్మ, కుమారుడు సిద్ధు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు డీసీఎం వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడిపి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమై.. బావిలో మృతదేహాలై

- మద్యం మత్తులో దారితప్పి బావిలో పడ్డ ఇద్దరు వలస కూలీలు
- కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ వద్ద ఘటన



వైద్యనాథ్(ఫైల్)



హరిసింగ్(ఫైల్)

జహీరాబాద్: సరుకుల కొనుగోలు కోసం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఇద్దరు వలస కూలీలు శుక్రవారం బావిలో కుళ్లిన మృతదేహాలై లభ్యమయ్యారు. ఈ విషాదకర ఘటన కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సతీశ్ కథనం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన వైజ్యనాథ్(25), హరిసింగ్(30) పైడిగుమ్మల్ గ్రామంలోని ఓ ఫామ్ హౌస్ వెంచర్‌లో కూలీ పనులు చేసుకుంటున్నారు. 10న సాయంత్రం సరుకుల కొనుగోలు కోసం గ్రామంలోకి వెళ్లారు. రాత్రి మద్యం సేవించి తిరుగు ప్రయాణం అయ్యారు. మత్తులో దారి తప్పి ప్రమాదవశాత్తు గ్రామానికి చెందిన క్రిష్ణయ్య వ్యవసాయ బావిలో పడ్డారు. వెంచర్‌కు కూలీలు రాకపోవడంతో 13న వెంచర్ సూపర్‌వైజర్ పంకజ్ తివారీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాడు. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. క్రిష్ణయ్య అనే రైతు శుక్రవారం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా దుర్గంధం రావడంతో బావిలోకి చూశాడు. కుళ్లినస్థితిలో మృతదేహాలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు శవాలను బయటకు తీయించి అక్కడే పోస్టుమార్టం జరిపించారు. మృతులు ఇద్దరు ఒకే గ్రామానికి చెందిన వారు. ఇందులో హరిసింగ్‌కు వివాహం కాగా కుమారుడు ఉన్నాడు. ఈ మేరకు కేసు చేసినట్లు కోహీర్ పోలీసులు తెలిపారు.

కుటుంబం మొత్తాన్ని కుల బహిష్కరణ చేశారు

– చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



కుమార్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని మల్లుపల్లిలో కురుమ కులానికి సంబంధించిన భూమి విషయంలో తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని అదే కులానికి చెందిన బాధితుడు గొంగళ్ల కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం మిరుదొడ్డిలో బాధితుడు విలేకరులతో గోడును వెల్లబోసుకున్నాడు. తనకు సంబంధించిన భూమి విషయంలో తమ కులస్తులు పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసినట్లు తెలిపాడు. గతేడాదిగా కులంలో ఎలాంటి పండుగలైనా, పబ్బాలైనా తమకు సమాచారం ఇవ్వకుండా దూరంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌తోపాటు, దుబ్బాక సీఐ, సిద్దిపేట సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయంపై మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరుశరామ్‌ను వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లిపై కూతురు దాడి

శివ్వంపేట(నర్సాపూర్) : తల్లి పై కూతురు దాడి చేసిన ఘటన మండల పరిధి భోజ్యా పంచాయతీ జెగ్యా తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన కోల కొమిలి కూతురు మంజులను కామారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. కొన్నేళ్లుగా మంజుల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తల్లి వద్దే ఉంటుంది. శుక్రవారం తల్లి, కూతురి మధ్య గొడవ తలెత్తగా తల్లిపై మంజుల కర్రతో దాడి చేసింది. కొమిలికి తీవ్ర గాయాలు కావడంతో తండావాసులు చికిత్స నిమిత్తం తూప్రాన్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గొడవకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

నాల్గోసారి లెక్క కుదిరింది

- అంగడి వేలం రూ.92.20 లక్షలు
- పంతం నెగ్గించుకున్న గుత్తేదారులు



అంగడి వేలం నిర్వహిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: వారాంతపు సంత బహిరంగ వేలానికి నాల్గోసారి లెక్క కుదరడంతో అంగడి వేలం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం మూడు అంగడిలకు వచ్చిన ఆదాయాన్ని సరాసరి లెక్క కట్టి వచ్చిన ఆదాయంతో సర్కార్ పాటను ప్రారంభించారు. 2022–23 సంవత్సరం రూ.76 లక్షల ఆరు వేలు, 2023–24 రూ.80 లక్షలు, 2024–25 రూ. కోటి 20 లక్షల 26 వేలు. ఈ మూడేళ్ల అంగడికి వచ్చిన ఆదాయంలో సరాసరి లెక్క కట్టి రూ.92 లక్షల 10 వేల, 667 నుంచి సర్కార్ పాటను ప్రారంభించారు. వేలం పాటలో 14 మంది గుత్తేదారురులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన గుత్తేదారుడు అయిలేని కిషన్ రెడ్డి వేలం ద్వారా రూ.92 లక్షల 20 వేల 667లకు అంగడిని దక్కించుకున్నాడు. అంగడి ద్వారా గతేడాది వచ్చిన ఆదాయానికి ఈ ఏడాది వచ్చిన ఆదాయాన్ని పోల్చుకుంటే దాదాపు రూ.2.80 లక్షల మున్సిపల్ ఆదాయం తగ్గింది. మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశాల మేరకు వేలం పాటను తగ్గించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. మూడుసార్లు అంగడి వేలం వాయిదా పడగా అధికారులే దిగివచ్చి వేలం పాటను తగ్గించారు. గుత్తేదారులు సిండికేట్‌గా ఏర్పడి సర్కార్ పాటను నామమాత్రంగా పెంచి అంగడిని దక్కించుకొని తమ పంతాన్ని నెగ్గించుకున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్ : యువతి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని రాజంపేటకు చెందిన యువతి(21) ఈ నెల 27న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి యువతి

యువకుడు అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ కథనం మేరకు.. పట్టణంలోని రాజ్యంపేటకు చెందిన కార్తీక్(22) 26న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తండ్రి శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని, ఎవరికైనా తెలిస్తే 8712661830 నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆస్పత్రికని వెళ్లి మహిళ

నర్సాపూర్ రూరల్: గిరిజన మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని జయరామ్ తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డి గూడ పంచాయతీ పరిధిలోని జయరామ్ తండాకు చెందిన మెగావత్ భుజాలీ (52) 25న ఉదయం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లింది. మధ్యాహ్నం కుమారుడు కుమార్ తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అప్పటి నుంచి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం కుమార్ నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మెగావత్ భుజాలీ

హైదరాబాద్‌కని వెళ్లి యువకుడు

నారాయణఖేడ్: యువకుడు అదృశ్యమైన ఘటన ఖేడ్ మండలం చాప్టా (కె) గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మంగలి సురేశ్ పది రోజుల కిందట హైదరాబాద్‌కి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. హైదరాబాద్‌పాటు బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. జాడ తెలిసిన వారు 95698 89400, 70576 83423 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు కోరారు.



మంగలి సురేశ్